# మిగులు ముసుగు.. నికర దోపిడీ!

మొదటిపేజీ తరువాయి...

ప్రామాణికంగా తీసుకుంటుందని ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో హస్తినలో ఇంత భారీ కుట్ర జరుగుతున్నా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తుండటంపైనా తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మేడిగడ్డను ఎండబెట్టి తెలంగాణలో గోదావరిజలాల వినియోగాన్ని తగ్గించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జరుగుతున్న చారిత్రక అన్యాయంపై ఎందుకు నోరు మెదపడంలేదని మండిపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో ప్రవహిస్తున్న నదుల్లో ప్రతి ఏటా ప్రవహించే నీటి పరిమాణాన్ని లెక్కించి ఆయా నదుల్లో ఎంత నీటి లభ్యత ఉన్నదో తేల్చి ఆయా రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేపట్టేందుకు నదీ ట్రిబ్యునళ్లు ఏర్పాటయ్యాయి. ఇలా దేశంలో దాదాపు ఎనిమిది ట్రిబ్యునళ్లు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం ఐదు మనుగడలో ఉన్నాయి. దశాబ్దాల నీటి లెక్కలు తీసుకొని శాస్త్రీయ మథనం చేసిన తర్వాతనే నదీ పరీవాహకంలోని రాష్ట్రాలకు 75 శాతం డిపెండబులిటీ, 65 శాతం డిపెండబులిటీపై ట్రిబ్యునల్స్ నీటి కేటాయింపులు చేపట్టాయి. అందులో భాగంగానే గోదావరి నదిలో పరీవాహక రాష్ట్రాల వినియోగం, అవసరాలను పరిగణలోనికి తీసుకొని ఒక ఒప్పందానికి వచ్చిన తర్వాతనే ఉమ్మడి ఏపీకి 1,486 టీఎంసీల కేటాయింపులు జరిగాయి. దానికి బచావత్ ట్రిబ్యునల్ ఆమోద ముద్ర వేసింది. మరో ట్రిబ్యునల్ ఏర్పాటై ఇంకో లెక్క తేల్చే వరకు బచావత్ ఆమోదించిన వివరాలే కేంద్రంతోపాటు అన్ని రాష్ట్రాలకు ప్రామాణికం. కానీ కృష్ణాజలాల్లో దశాబ్దాలపాటు అన్యాయానికి గురైన తెలంగాణకు గోదావరిలోనూ అదే తరహా అన్యాయం చేసేందుకు సిద్ధమైన చంద్రబాబు తాజాగా కొత్త సూత్రాన్ని తెరపైకి తెచ్చారు.



## కృష్ణాజలాల్లో వాటా ఇస్తారా?

"సముద్రంలో కలిసే వృథాజలాల ఆధారంగా ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును చేపడతామని చెప్తున్నది. ఆ మేరకు పోలవరంలో బచావత్ ట్రిబ్యునల్ అవార్డు మేరకు ఎగువ రాష్ట్రాలకు కృష్ణాజలాల్లో వాటా పెంచినట్లుగా ఇందులోనూ వాటా ఇస్తారా? అసలు గోదావరిలో శాస్త్రీయంగా ఎంత నీటి లభ్యత ఉన్నది? ఎగువ రాష్ట్రాల ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలు ఏందనే లెక్కలు తీయాలి. అవన్నీపోగా మిగులు ఉన్నాయని తేలితే బనకచర్లకు కేంద్రం అనుమతి ఇవ్వాలి. తద్వారా ఆ ప్రాజెక్టుకు ఎంత కేటాయిస్తారో, అంతమేర కృష్ణా జలాల్లో తెలంగాణకు అదనపు వాటా ఇవ్వాలి.

- ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి, ట్రీ ప్రధాన కార్యదర్శి

### శాస్త్రీయ లెక్క తేల్చకనే తెరపైకి చంద్రబాబు

తమిళనాట రాజకీయ ప్రయోజనాలు పొందాలనే లక్ష్యాన్ని ఎంచుకున్న తర్వాత కొన్ని సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. మంచు కరిగి హిమనీ నదీజలాలు వృథాగా పోతుండటం, రుతుపవనాలు గతి తప్పడంతో దక్షిణాది నదులు ఒట్టిపోతున్నందున వాజ్‌పేయి హయాంలో నదుల అనుసంధానం అనే ప్రక్రియను తెచ్చారు. కానీ అందుకు తిలోదకాలిస్తున్న మోదీ సర్కారు ఉత్తరాది నుంచి దక్షిణాదికి అనుసంధానాన్ని అటకెక్కించి గోదావరి-కావేరీ ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. దీనిపై కేంద్రంలోని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్‌డబ్ల్యూడీఏ) కేసీఆర్ హయాంలోనూ అనేక సమావేశాలు నిర్వహించింది. అయితే గోదావరిలో ఆయా రాష్ట్రాలు వాడుకోగా మిగులు జలాలు ఉంటే శాస్త్రీయంగా లెక్క తేల్చి అప్పుడు కావేరీకి తరలించాలని కేసీఆర్ ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఆ శాస్త్రీయ లెక్కలను తేల్చి అన్ని రాష్ట్రాల గత, ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను బేరీజు వేస్తే మిగులు అనేది ఉంటుందా? లేదా? అనేది సందేహాస్పదమే. అందుకే తేల్చలేని ఆ లెక్కలను ముందు వేసుకోవడం వృథా ప్రయాస అనుకునే మోదీ ప్రభుత్వం చంద్రబాబును రంగంలోకి దింపింది. ఆ మేరకు చంద్రబాబు వృథా జలాలు అంటూ బనకచర్ల ప్రాజెక్టును రూపొందించి గోదావరిని తరలించుకుపోవాలని స్కెచ్ వేసినట్టు తెలుస్తున్నది. అయితే కచ్చితంగా ఏటా 2వేల టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలుస్తాయనేది తేల్చాల్సింది ట్రిబ్యునల్. అది నిజమేనని తేలితే ఆ మేరకు ఎగువ రాష్ట్రాలకు కూడా అందులో వాటా ఉంటుంది. కానీ 2 వేల టీఎంసీలు కలుస్తున్నందున అందులో 200 టీఎంసీలు (10 శాతం) తాను మలుపుకుపోతానని చంద్రబాబు అనడం ఎంత వరకు శాస్త్రీయం? మరి ఏపీ వాటా 10 శాతమైతే తెలంగాణ, ఎగువన ఉన్న మిగిలిన రాష్ట్రాల వాటా తేల్చాల్సింది ఎవరు? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

### కేంద్రం అనుమతికి ప్రాతిపదిక ఏది?

దేశ సాగునీటి రంగ చరిత్రలో ఒక జాతీయ ప్రాజెక్టు చేపట్టాలన్నా, ఆయా రాష్ట్రాలు కేంద్ర జల సంఘం అనుమతితో ప్రాజెక్టులను నిర్మించాలన్నా అన్నింటికంటే ముందుగా రేకెత్తే ప్రశ్న నీటి కేటాయింపులు ఉన్నాయా అని? మరి ఈ కేటాయింపులు అనేవి ట్రిబ్యునల్ ఆధారంగానే జరుగుతాయి. అందుకే ఇప్పటివరకు కేంద్రం అనుమతులు ఇచ్చిన ప్రతి ప్రాజెక్టుకు ట్రిబ్యునల్ నీటి కేటాయింపులే ప్రామాణికం. అలాంటప్పుడు చరిత్రలో ఎన్నడూలేని విధంగా, జాతీయ నీటి ప్రమాణాలకు భిన్నంగా మోదీ ప్రభుత్వం చంద్రబాబు చెప్తున్న వృథాజలాల ఆధారిత బనకచర్లకు అనుమతులు ఎలా ఇస్తుంది? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కానుంది. సముద్రంలో కలిసే వృథా జలాలకు కేంద్రం అనుమతులు ఇచ్చి, నిధులు సమకూరిస్తే భవిష్యత్తులో మిగిలిన రాష్ట్రాలు కూడా సముద్రంలో కలిసే జలాల ఆధారంగానే ప్రాజెక్టుల్ని రూపొందించుకుంటాయి. తద్వారా ఎగువ రాష్ట్రాల హక్కుల్ని కాపాడేది ఎవరు? అని సందేహం వ్యక్తమవుతున్నది. ప్రధానంగా కృష్ణాలో కూడా ఈ ఏడాది (2024-25) 858 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. 2023-24 నీటి సంవత్సరంలో 72 టీఎంసీలు, 2022-23 నీటి సంవత్సరంలో 765 టీఎంసీలు సముద్రంలోకి వెళ్లాయి. మరి వీటి ఆధారంగా తెలంగాణగానీ, ఇతర రాష్ట్రాలుగానీ ప్రాజెక్టుల రూపకల్పన చేస్తే కేంద్రం అనుమతి ఇస్తుందా? కావేరీకి గోదావరి జలాలను తరలించాలనే రాజకీయ తాపత్రయంలో కేంద్రం బనకచర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి కావేరీతో ముందుకు పోతే దక్షిణాది రాష్ట్రాల జలాల పంపిణీల్లో మరిన్ని చిక్కుముళ్లు, వివాదాలు రాజుకుంటాయి.

### కండ్లు తెరవరు... అన్యాయన్ని ప్రశ్నించరు!

'ఒర్లి ఒర్లి వీడు పోతడు.. వండుక తిని వాడు పోతడు'.. తెలంగాణలోని ఈ సామెత ఇప్పుడు గోదావరిలో రాష్ట్ర దుస్థితికి అద్దం పడుతున్నది. కేసీఆర్ మీద కోపంతో రేవంత్ ప్రభుత్వం మేడిగడ్డను పునరుద్ధరించకుండా రాజకీయ విమర్శలు చేసుకుంటూ పబ్బం గడుపుతున్నది. తెల్లారింది మొదలు గోదావరిజలాల వినియోగాన్ని ఎలా పెంచాలనే ధ్యాస మరిచి, కేసీఆర్‌ను బదనాం చేయడంపైనే దృష్టి పెడుతున్నది. ఇదే అదునుగా చంద్రబాబు బనకచర్ల, మోదీ సర్కారు కావేరీ ప్రాజెక్టుల్ని చకాచకా పట్టా లెక్కించేందుకు పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా చంద్రబాబు రెండు రోజుల కిందట ఢిల్లీ మీడియా సమావేశంలో బనకచర్లకు వాడుకునే జలాలు సముద్రంలో కలిసే వృథా జలాలేనని, ఇందులో ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదన్నారు. సరిగ్గా వైఎస్ హయాంలో కూడా పోతిరెడ్డిపాడు విషయంలో వరద జలాల ఆధారంగా పోతిరెడ్డిపాడు విస్తరణ చేస్తున్నందున నీటి హక్కుల్ని అడగబోమని లిఖితపూర్వకంగా ట్రిబ్యునల్‌కు రాసి ఇచ్చినట్టు రిటైర్డ్ ఇంజినీర్ ఒకరు తెలిపారు. ఇప్పుడు కృష్ణా బోర్డు ముందు ఏపీ అదేదో హక్కుభుక్తంగా పోతిరెడ్డిపాడుకు నీటి కేటాయింపులు ఉన్నట్టు గిరిగీసి మరీ ఏటా వందల టీఎంసీలను శ్రీశైలం నుంచి తరలిస్తున్నది. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్తు కేంద్రంలో కరెంటు ఉత్పత్తి చేస్తే కూడా పోతిరెడ్డిపాడుకు నీళ్లు అందడం లేదని, వెంటనే నిలిపివేయాలంటూ బోర్డుకు ఫిర్యాదు చేస్తున్నది. ఇట్లనే భవిష్యత్తులో బనకచర్ల, కావేరికి నీళ్లు సరిపోవడంలేదని, వెంటనే కాళేశ్వరం, దేవాదుల ఎత్తిపోతల నిలిపివేయాలంటూ ఫిర్యాదులు చేసే పరిస్థితులు కూడా దాపురించే ప్రమాదం ఉందని పలువురు విశ్రాంత ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## లోకం పోకడ




మొన్న నేషనల్ హెరాల్డ్ కేసుతో జాతీయ స్థాయిలో, ఈ రోజు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పేరు మారుమోగిపోతున్నది!

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 37.1°c | 22.5°c |
| నల్లగొండ | 37.0°c | 23.4°c |
| వరంగల్ | 36.0°c | 25.0°c |
| రంగారెడ్డి | 34.9°c | 22.1°c |
| మెదక్ | 34.9°c | 25.2°c |
| హైదరాబాద్ | 34.6°c | 24.5°c |
| ఖమ్మం | 33.0°c | 25.0°c |
| నిజామాబాద్ | 32.0°c | 24.5°c |
| మహబూబ్‌నగర్ | 32.0°c | 25.0°c |
| కరీంనగర్ | 31.0°c | 26.0°c |

# ఎట్టకేలకు మేలుకున్న కాంగ్రెస్ సర్కార్

- 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో సర్కారులో చలనం
- గోదావరిని కొల్లగొట్టే కుట్రలపై రివర్‌బోర్డులకు లేఖలు
- బనకచర్లను జీఆర్ఎంబీ అడ్డుకోవటంలేదన్న ఈఎన్సీ
- కేఆర్ఎంబీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని ఆరోపణ



హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): గోదావరిని కొల్లగొట్టే కుట్రలపై నమస్తే తెలంగాణ వరుస కథనాలతో ఎట్టకేలకు కాంగ్రెస్ సర్కారులో చలనం వచ్చింది. దీంతో కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల తీరుపై రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ ఫిర్యాదులపై ఉదాసీనంగా వ్యవహరిస్తూ, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఆయన రెండు బోర్డులకు వేర్వేరుగా పలు అంశాలపై లేఖలు రాశారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న గోదావరి-బనకచర్ల లింక్ (జీబీలింక్) ప్రాజెక్టు పనులను తక్షణమే అడ్డుకోవాలని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ)కు రాసిన లేఖలో డిమాండ్ చేశారు. ప్రాజె క్టు పనులను నిలువరించడంలో బోర్డు పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జీబీ లింక్ ప్రాజెక్టుపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అనేకసార్లు బోర్డుకు ఫిర్యాదుచేశామని గుర్తుచేశారు. ప్రాజెక్టు ప్రతిపాదనల దశలోనే ఉన్నదంటూనే ఏపీ ఇప్పటికే ప్రీ ఫీజిబిలిటీ అధ్యయనాల రిపోర్టును సమర్పించేందుకు సిద్ధమైందని పేర్కొన్నారు. ప్రాజెక్టులో భాగమైన బొల్లపల్లి రిజర్వాయర్‌కు సంబంధించి ఏపీలోని ముంపు గ్రామాలపై ఇప్పటికే సర్వే చేయించినట్టు సమాచారం ఉన్నదని తెలిపారు. బోర్డు మాత్రం అవేవీ తమ దృష్టికి రాలేదని చెప్తూ చోద్యం చూస్తున్నదని చెప్పారు. తాము ఫిర్యాదుచేసినా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని, కేంద్ర జలశక్తి శాఖ వీఐపీ రిఫరెన్స్‌తో కాన్సెప్ట్ నోట్‌ను పంపించినా మెంబర్ స్టేటైన తెలంగాణకు సమాచారం ఇవ్వలేదని, మొత్తంగా బోర్డు తన విధులు నిర్వర్తించడంలో ఘోరంగా విఫలమైందని ఈఎన్సీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా నదులపై కొత్త ప్రాజెక్టులు చేపడితే అప్పటికే నిర్మించిన, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపై ప్రభావం పడకుండా చూడాల్సిన బాధ్యతను బోర్డు విస్మరించిందని అన్నారు. ఏపీ ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లకుండా అడ్డుకోవాలని కోరారు. ల్యాండ్ సర్వే, టెండర్ల పనులను నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. బనకచర్లతోపాటు పోలవరం ప్రాజెక్టులోని డెడ్ స్టోరేజీ నీళ్లతో ఏపీ చేపట్టాలనుకుంటున్న లిఫ్ట్ ప్రాజెక్టును కూడా వెంటనే ఆపాలని పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ)తోపాటు జీఆర్ఎంబీకి ఈఎన్సీ జనరల్ మరో లేఖ రాశారు. డెడ్‌స్టోరేజీ నుంచి నీటిని తీసుకెళ్లడం వల్ల గోదావరి డెల్టా స్కీమ్‌పై ప్రభావం పడుతుందని, తమ ప్రాజెక్టులకూ నీళ్లు దక్కవని ఆక్షేపించారు.

### కేఆర్ఎంబీపై అసహనం

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) తీరుపై కూడా ఈఎన్సీ అనిల్‌కుమార్ అసహనం వ్యక్తంచేశారు. ఏకపక్షంగా నీటి విడుదలకు ఆదేశాలు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. నాగార్జునసాగర్‌లో కనీస నీటిమట్టం 510 అడుగులు మెయింటెయిన్ చేయాలని, అప్పుడే ఏఎమ్మార్పీ లిఫ్ట్ స్కీమ్‌కు నీటిని తీసుకునే వీలుంటుందని తాము పదే పదే కోరినా పట్టించుకోకుండా, 505 అడుగుల వరకూ నీటిని తీసుకెళ్లొచ్చంటూ ఏకపక్షంగా నిర్ణయించడమేంటని ప్రశ్నించారు. వాటర్ రిలీజ్ ఆర్డర్ ఇవ్వాలని తెలంగాణ కోరినా పట్టించుకోలేదని, కానీ ఏపీ 10 టీఎంసీలు కావాలని అడగ్గానే ఆగమేఘాలపై వాటర్ రిలీజ్ ఆర్డర్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఏపీ అడిగిందే తడవుగా ఆర్డర్లు ఇస్తున్న బోర్డు, తెలంగాణను మాత్రం లెక్క చేయడం లేదని, ఇది ఆమోదయోగ్యం కాదని తేల్చి చెప్పారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో 510 అడుగులకు ఎగువన 4.458 టీఎంసీల నీళ్లే ఉన్నాయని, ఏపీకి నీటిని ఇచ్చేస్తే తెలంగాణ పరిస్థితి ఏమిటి? ఏఎంఆర్పీకి నీళ్లు ఎలా? అని బోర్డును ప్రశ్నించారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి విడుదల గురించి రిలీజ్ ఆర్డర్‌లో కనీసం ప్రస్తావించలేదని, ఇకనైనా రిలీజ్ ఆర్డర్‌ను సవరించి మళ్లీ ఇవ్వాలని, సాగర్‌లో 510 అడుగుల కనీస మట్టాన్ని మెయింటెయిన్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

# నీటి హక్కులను కాలరాస్తుంటే ఏం చేస్తున్నారు?



మొదటిపేజీ తరువాయి...

గుర్తుచేశారు. కానీ అందుకు విరుద్ధంగా ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలను ఏపీ సర్కారు తుంగలో తొక్కుతున్నదని ధ్వజమెత్తారు. అడ్డుకోవాల్సిన కేంద్రం నిధులిచ్చి సహకరించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు, మరో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకుంటే ఎఫ్ఆర్‌బీఎం రికవరీ పెట్టిన బీజేపీ సర్కారు, ఇప్పుడు బనకచర్లకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి రుణ సమీకరణకు అవకాశం కల్పించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ, ఆంధ్రప్రదేశ్‌పై వరాల జల్లులు కురిపిస్తున్నా కాంగ్రెస్ సర్కారు కేంద్రాన్ని నిలదీసే ధైర్యం ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు కేంద్రాన్ని నిలదీసే, పోరాటం చేసే పరిస్థితి లేకపోవడంతో తెలంగాణ నష్టపోయే దుస్థితి వచ్చిందని పేర్కొన్నారు.

"కాంగ్రెస్ అంటేనే కరప్షన్.. ఆ పార్టీ డీఎన్ఏలోనే అవినీతి ఉన్నది. ప్రాణహిత-చేవెళ్ల (నిర్మాణానికి 2007లో రూ.17,875 కోట్లతో జీవో ఇచ్చి 19 నెలల్లో తట్టెడుమట్టి ఎత్తకుండానే రూ.38,500 కోట్లకు, ఆ తర్వాత రూ.43,300 కోట్లకు అంచనాలు పెంచి దండుకున్న చరిత్ర కాంగ్రెస్‌దే.

-హరీశ్‌రావు

### కాళేశ్వరంపై దుష్ప్రచారం

కరప్షన్‌కు కేరాఫ్‌గా ప్రసిద్ధిగాంచిన కాంగ్రెస్ సర్కారు కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తున్నదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకవైపు ప్రాజెక్టులోని రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లను వినియోగిస్తూనే మరోవైపు పనికిరానిదని, వైట్ ఎలిఫెంట్ అని అనడం దుర్మార్గమని మండిపడ్డారు. మతిభ్రమించిన నీటిపారుదల మంత్రి ఉత్తమ్ ఈ బృహత్తర పథకంపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కాళేశ్వరాన్ని దుష్ప్రచారం చేయడమే ఎజెండాగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. వీళ్లిద్దరే తెలంగాణ పాలిట వైట్‌ఎలిఫెంట్లు అని, ఒకరు ఆదాయానికి ఎసరుపెడితే, మరొకరు నీటి వాటాకు గండికొడుతున్నారని అన్నారు.

### అవగాహనలేకే కారుకూతలు

కమీషన్ల కోసమే తుమ్మిడిహెట్టి దగ్గర కట్టాల్సిన ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చారంటూ అదే పనిగా కాంగ్రెస్ నాయకులు కారుకూతలు కూస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. 'తుమ్మిడిహెట్టి దగ్గర తగినంత నీటి లభ్యత లేదని 2015 ఫిబ్రవరి 18, మార్చి4న సీడబ్ల్యూసీ రాసిన లేఖల్లో పేర్కొన్న మాట వాస్తవం కాదా? తుమ్మిడిహెట్టి వద్ద ఖర్చు చేసే ప్రతి రూపాయి వ్యర్థమేనని మహారాష్ట్ర సీఎం ఉత్తరం రాసింది నిజంకాదా?'అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడకముందు ఏడేండ్లు మహారాష్ట్ర, ఉమ్మడి ఏపీ, కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పటికీ తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టుకు ఎందుకు అనుమతులు సాధించలేదని, తట్టెడుమట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. ఏపనీ చేయకుండానే మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట రూ.2,328 కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. 'కాళేశ్వరం గురించి ఎక్కడైనా వాస్తవాలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం. విచారణ తర్వాత చర్యలు తప్పవని మంత్రి ప్రకటించడం చూస్తుంటే..విచారణ తీరుపై అనుమానాలొస్తున్నాయి'అని పేర్కొన్నారు.

### ప్రాణహితకు ఖర్చు చేసింది రూ.3,780 కోట్లే

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు ఏడేండ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చుచేసినట్టు మంత్రి ఉత్తమ్ చెప్పింది శుద్ధ అబద్ధమని హరీశ్‌రావు కొట్టిపారేశారు. భూసేకరణ, ఇతర పనులకు చేసిన ఖర్చు రూ.3,780 కోట్లేనని స్పష్టంచేశారు. 'కాంగ్రెస్ నేతలు బరాజ్ నిర్మించి? ఎల్లంపల్లి దాకా గ్రావిటీ కెనాల్‌ను తవ్వితే ప్రాజెక్టు రీడిజైనింగ్ అవసరం ఉండేదికాదని చెప్పారు. కాంగ్రెస్ తప్పులు సరిదిద్దేందుకు, చేసిన ఖర్చు వృథాకాకుండా చూసేందుకు ప్రాణహితను రీడిజైనింగ్ చేసి కాళేశ్వరం నిర్మించామని స్పష్టంచేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కడతామని చెప్పి ఏడాదిన్నర దాటినా పిడికెడు మట్టి కూడా ఎందుకు తీయలేదని ప్రశ్నించారు.

"ప్రాజెక్టుల నిర్మాణం, పంపుల ఏర్పాటుపై ఉత్తమ్‌కు అవగాహన లేదు ప్రాణహిత-చేవెళ్ల పూర్తి స్థాయి గ్రావిటీ ప్రాజెక్టు అని చెప్పిన మంత్రి.. ఇప్పుడు ఒక పంపు అవసరమని మాట మార్చడమే అజ్ఞానానికి నిదర్శనం. ఒక్క పంపు, రెండు పంపులు ఉండవు. అవసరమైన మేరకు ప్రతి చుక్కనూ ఎత్తిపోయాల్సిందే.

-హరీశ్‌రావు

### ఎస్‌ఎల్‌బీసీపై చర్చకు సిద్ధమా?

రెండు దశాబ్దాలుగా పక్కన పెట్టడం వల్లే ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిందని మంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని హరీశ్‌రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రూ.3,200 కోట్లు ఖర్చుచేసి 12 కిలోమీటర్లు సొరంగం తవ్వి, డిండి, పెండ్లిపాక రిజర్వాయర్ల పనులు పూర్తి చేశామని చెప్పారు. నిరూపించేందుకు చర్చకు మీరు సిద్ధమా? హైదరాబాద్‌లోనైనా, హుజూర్‌నగర్‌లోనైనా చర్చించేందుకు రెడీ అని సవాల్ విసిరారు.

### ఎన్ని లక్షల ఎకరాలకు నీళ్లిచ్చారు?

గద్దెనెక్కిన మొదటి ఏడాదిలోనే ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ సర్కారు ఏడాదిన్నర దాటినా కనీసం ఆరు ఎకరాలకైనా నీళ్లిచ్చిందా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ద్వారా 20 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని, అసెంబ్లీలో రేవంత్ సర్కారు విడుదలచేసిన శ్వేతపత్రమే సాక్షి అని తెలిపారు.

### అంచనా పెరగని ప్రాజెక్టులేవీ?

దేశంలో అంచనా పెంచకుండా ఏ ప్రాజెక్టును పూర్తిచేశారో చెప్పాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. దేశంలోనే కాళేశ్వరం అత్యంత తక్కువ కాస్ట్ ఎస్కలేషన్‌తో పూర్తిచేసిన ప్రాజెక్టని స్పష్టంచేశారు. ప్రాజెక్టు వ్యయం పెరిగిందని మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు .. బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్ల సామర్థ్యాన్ని 16 టీఎంసీల నుంచి 141 టీఎంసీలకు, నీటి వినియోగాన్ని 160 టీఎంసీల నుంచి 240 టీఎంసీలకు, ఆయకట్టును 16.4 లక్షల ఎకరాల నుంచి 18.25 లక్షలకు (స్థిరీకరణ 18.8 లక్షల ఎకరాలు), పంపింగ్ కెపాసిటీని 1.8 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. నాడు ఎకరానికి రూ.2 లక్షలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.11 లక్షల పరిహారం ఇచ్చిందని గుర్తుచేశారు.



# కేరళను తాకిన నైరుతి

ఎనిమిది రోజుల ముందుగానే ప్రవేశం
2009 తర్వాత ఇదే దేశంలో మొదటిసారి
25 ఏండ్లలో రెండోసారి వేగంగా రాక
వెల్లడించిన భారత వాతావారణశాఖ

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు శనివారం ఉదయం కేరళ తీరాన్ని తాకాయి. సాధారణంగా జూన్1న ప్రవేశించే రుతుపవనాలు జూలై 8న నాటికి దేశమంతా విస్తరిస్తాయి. ఈఏడు మాత్రం ఎనిమిది రోజుల ముందుగానే ప్రవేశించాయని భారత వాతావారణశాఖ అధికారులు శనివారం ప్రకటనలో వెల్లడించారు. 16ఏండ్ల (2009) తర్వాత కంటే ముందే వచ్చాయని తెలిపారు. 25ఏండ్లలో 2001, 2009లో నిర్దేశిత సమయానికి ముందే.. అంటే మే 24నే కేరళ తీరానికి చేరాయని పేర్కొన్నారు. 1918లో అత్యంత వేగంగా మే11న కేరళను తాకడమే ఇప్పటి వరకు రికార్డు అని వెల్లడించారు. 1972లో అత్యంత ఆలస్యంగా జూన్ 18న కేరళలోకి ప్రవేశించాయని తెలిపారు. 2023లో మే 30న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న, 2009లో జూన్ 8న, 2018లో మే 29న రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయని వివరించారు. మరోవైపు అరేబియా సముద్రంలో దక్షిణ్ కొంకణ్ తీరానికి సమీపంలో ఏర్పడ్డ అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని పేర్కొన్నారు. మరికొన్ని గంటల్లో రత్నగిరి, దపోలి మధ్య దక్షిణ కొంకణ్ తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్టు వెల్లడించారు. అల్పపీడనం కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. జూన్1లోగా తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశమున్నట్టు వివరించారు.

### ఈసారి ఎక్కువ వర్షపాతం: కేరళ ఐఎండీ డైరెక్టర్

ఈ ఏడు సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసినట్టు కేరళ ఏరియా ఐఎండీ డైరెక్టర్ నీతా కే గోపాల్ పేర్కొన్నారు. ఇప్పటికే దక్షిణ అరేబియా సముద్రంలోని అన్ని ప్రాంతాలు, పశ్చిమ-మధ్య, తూర్పు-మధ్య అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్‌లో మొత్తంగా, కేరళ, కర్ణాటక, తమిళనాడులోని అనేకచోట్ల రుతుపవనాలు విస్తరించాయని తెలియజేశారు. సెప్టెంబర్ 17నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమై.. అక్టోబర్ 15నాటికి ఉపసంహరణ పూర్తవుతుందన్నారు.

# సీఈవో ప్రసంగాన్ని అడ్డుకున్న ఉద్యోగికి షాక్

## మైక్రోసాఫ్ట్ సంస్థ నుంచి తొలగింపు

వాషింగ్టన్ : గాజాలో యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్‌కు మైక్రోసాఫ్ట్ టెక్నాలజీని అందిస్తుండటాన్ని ప్రశ్నించిన ఆ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు తన ఉద్యోగాన్ని కోల్పోయారు. సీటెల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రసంగిస్తుండగా జో లోపెజ్ గట్టిగా కేకలు వేస్తూ, నిరసన తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యానికి అజ్యూర్ టెక్నాలజీని అందిస్తుండటాన్ని ప్రశ్నించారు. ఈ టెక్నాలజీ పాలస్తీనీయులను చంపడానికి ఉపయోగపడుతుండటంపై నిరసన తెలిపారు. దీనిని ఎలా సమర్థించుకుంటారని నిలదీశారు. ''ఫ్రీ పాలస్తీనా'' అని నినాదాలు చేశారు. ఆ సమయంలో సత్య వేదికపైనే కాసేపు మౌనంగా ఉండి, ఆ తర్వాత ప్రసంగాన్ని కొనసాగించారు. లోపెజ్‌ను భద్రతా సిబ్బంది బయటకు తీసుకెళ్లిపోయారు.

# కులగణనకు తెలంగాణ రోల్‌మాడల్ కాదు

## రాహుల్‌గాంధీకి వకుళాభరణం లేఖ



హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన, 42 శాతం బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ జాతీయస్థాయిలో రోల్ మాడల్‌గా ప్రచారం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించే చర్య అని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి బహిరంగ లేఖ రాశారు. రేవంత్ ప్రభుత్వం నిర్వహించిన కులగణనను దేశానికి రోల్ మాడల్ అంటూ అభివర్ణించడం సిగ్గుచేటని విమర్శించారు. కులగణన నిబంధనల ప్రకారం చేయలేదని, ప్రణాళికశాఖ ద్వారా మాత్రమే నిర్వహించారని తెలిపారు. కులాలవారీగా లెక్కలను అధికారికంగా వెల్లడించలేదని పేర్కొన్నారు. బీసీ కమిషన్ నివేదిక బయటపెట్టకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్య అంటూ నిప్పులు చెరిగారు.

# విద్యాశాఖలో ఎన్జీవోల రాజ్యం

- 3,4 ఎన్జీవోలు చెప్పిందే వేదం
- ఉన్నతాధికారుల తీరుతో తలలు పట్టుకుంటున్న అధికారులు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : కొత్త ఐఏఎస్ అధికారి బాధ్యతలు చేపట్టగానే.. కొత్త ఎన్జీవోలు రంగ ప్రవేశం చేస్తాయి. ఈ ప్రోగ్రామ్.. ఆ ప్రోగ్రామ్ అంటూ హడావుడి చేసేస్తాయి. ఆయా ఐఏఎస్ అధికారి మారగానే అవన్నీ మూలనపడతాయి. ఆ తర్వాత మళ్లీ పాత కథే మొదలవుతుంది. ఇది విద్యాశాఖలో జరుగుతున్న నిత్య తంతు. పాఠశాల విద్యాశాఖలో మూడు నాలుగు స్వచ్ఛందసంస్థలు(ఎన్జీవోలు) చెప్పిందే వేదంగా నడుస్తున్నదని తెలుస్తున్నది. ఈ ఎన్జీవోలకు ఉన్నతాధికారులు రెడ్ కార్పెట్ పరుస్తున్నట్టు సమాచారం. కొత్తగా మరో రెండు, మూడు ఎన్జీవోలు రాబోతున్నాయని తెలుస్తున్నది. ఆయా ఎన్జీవోలతో ఎంవోయూలు కుదుర్చుకునేందుకు రంగం సిద్ధమయ్యిందని సమాచారం. ఓ ఎన్జీవో కంప్యూటర్లు కొనండి.. డిజిటల్ పాఠాల కంటెంట్‌ను సమకూరుస్తామని పేర్కొందట. దీంతో కిందిస్థాయిలోని విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇదేం వ్యవహారమని విస్తుపోతున్నారు. ఇక ఎన్జీవోల జోక్యం పాఠశాల విద్యాశాఖను దాటి ఉన్నత విద్యాశాఖలోకి ప్రవేశించనున్నట్టు సమాచారం. ఇంటర్మీడియట్ విద్యలోనూ ఓ ఎన్జీవోను ప్రోత్సహించేందుకు ప్రయత్నం జరుగుతుందని తెలిసింది.

### ఎన్జీవోల పెత్తనమేంటీ..

అసలే సర్కారు బడులకు పిల్లలే వస్తలేరంటే.. ఎన్జీవోలను ప్రోత్సహించి భ్రష్టు పట్టిస్తున్నారని విద్యాశాఖలోని ఓ అధికారి వాపోయారు. విద్యాశాఖను ప్రభుత్వం పాలిస్తున్నదా.. ఎన్జీవోలు పాలిస్తున్నాయా..? తెలియడం లేదంటూ మరో అధికారి ఆవేదన వ్యక్తంచేశారు. ఓ ఎన్జీవో వచ్చి లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ అంటుంది.. మరొకరొచ్చి డిజిటల్ విద్య.. తెల్లారి మరొకరొచ్చి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంటారు. ఇలా రోజుకొకటి చొప్పున గందరగోళం సృష్టిస్తున్నారని విద్యాశాఖలోని అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఎన్జీవోలను ప్రోత్సహించే విషయంలో గతంలో ఓ ఇద్దరు ఐఏఎస్ అధికారుల మధ్య పంచాయితీ కూడా నడిచింది. ఓ అధికారి ఎన్జీవోలు చెప్పినట్టు నడుచుకోవాలని చెప్పగా, ఎన్జీవోల మితిమీరిన జోక్యమేంటని మరో ఐఏఎస్ ప్రశ్నించారు.

### ఇది వరకు పనిచేసిన ఎన్జీవోలు

- యూనిసెఫ్, ఇంక్విలాబ్ ఫౌండేషన్లు సంయుక్తంగా తెలంగాణ ఇన్నోవేషన్ చాలెంజ్‌ను నిర్వహించాయి. ఇప్పుడు ఇది మూలనపడింది.
- కొంత కాలం క్రితం వరకు రూమ్ టు రీడ్ ఫౌండేషన్ గ్రంథాలయాల మీద పనిచేసింది. రీడింగ్ కార్నర్‌లు ఏర్పాటు చేశారు. పుస్తకాలు పంపిణీ చేశారు. ఆ తర్వాత అది అటకెక్కింది.
- ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) మీద సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్(సీఎస్ఎఫ్) పనిచేసింది. ఎఫ్ఎల్ఎన్‌ను కొన్ని సంఘాలు వ్యతిరేకించడంతో ఇది సస్పెన్స్‌లో పడింది.
- ఇంటింటా చదువుల పంట పేరుతో వాట్సాప్ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇది మరుగున పడింది.
- ఇంగ్లిష్ మీడియంలో టీచర్ల శిక్షణకు అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్‌తో ఎంవోయూ చేసుకున్నారు. ప్రస్తుతం వినియోగంలో లేదు.




### ప్రస్తుతం పని చేస్తున్నవి..

- ఈ ఏడాది నుంచి నందన్ నిలేకనికి చెందిన ఏక్‌స్టెప్ ఫౌండేషన్ రాష్ట్రంలో పనిచేస్తున్నది. ఏఐ పాఠాలంటూ వచ్చింది. రాష్ట్రంలోని విద్యార్థులకు చదవడం, రాయడం రావడంలేదంటూ న్యాస్ సర్వే గగ్గోలుపెట్టింది. మాతృభాష అయిన తెలుగును సరిగ్గా చదవలేని స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ పరిస్థితుల్లో ఏఐ ఎందుకు అన్న ప్రశ్నలొస్తున్నాయి.
- ఖాన్ అకాడమీ ఆధ్వర్యంలో సైన్స్, గణితం టీచర్లకు శిక్షణ ఇప్పిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో రిసోర్స్ పర్సన్స్‌ను ఎంపికచేసిన తర్వాత మళ్లీ ఎన్జీవోలతో పనేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
- ప్రజ్వల ఎన్జీవో, ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థల ద్వారా బాలికల సాధికారత, భద్రత, రక్షణ కోసం మరో కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్టు తెలిసింది.